సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం, 16, ఫిబ్రవరి, 2024



నేడు రథ సప్తమి వేడుకలు
యాదాద్రి ఆలయంలో శుక్రవారం రథ సప్తమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. - 8లో



ఇద్దరు దొంగల అరెస్ట్
దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను గురువారం భువనగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



నేడు అంకురార్పణ
చెర్వుగట్టు ఆలయ బ్రహ్మోత్సవాలకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అంకురార్పణ చేయనున్నారు. - 8లో

న్యూస్‌రీల్

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న పూజారి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు శ్రీస్వామి అమ్మవార్లకు సుప్రభాతం నిర్వహించారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన వంటి పూజలు చేపట్టారు. ఆ తర్వాత ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి కైంకర్యాలను భక్తులచే చేపట్టారు. సాయంత్రం జోడు సేవలను మాఢ వీధిలో ఊరేగించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ప్రజల సౌకర్యార్థమే ఉచిత వైద్యశిబిరాలు



ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ పరిపూర్ణాచారి

గుండాల: ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి పరిపూర్ణాచారి అన్నారు. మండలంలోని అనంతారం గ్రామంలో హెల్త్‌కేర్ హాస్పిటల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రామాల్లో గ్రామ దేవతల పండుగలు జరుగుతున్న నేపథ్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆయన వెంట డాక్టర్ ప్రసన్నకుమార్, సీహెచ్‌వో భాషయ్య, పీహెచ్‌ఎన్ వనజకుమారి, ల్యాబ్ టెక్నిషియన్ రేఖ, ఫార్మాసిస్టు రాజు, ఏఎన్‌ఎం రజియా, ఎంఎల్‌హెచ్‌పీ రాణా తబుస్సమ్, కిరణ్, సంతోష్‌రెడ్డి, ఆశ వర్కర్లు ఉన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



తుర్కపల్లి గ్రామ సభలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శోభారాణి

తుర్కపల్లి: ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని జెడ్పీ సీఈఓ శోభారాణి అన్నారు. గురువారం తుర్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారులు, కార్యదర్శులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం మండల కేంద్రంలో పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ, వీధిలైట్ల ఏర్పాటు పనులకు ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరిటెండెంట్ ఇన్నారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు బోరెడ్డి వనజహన్మంత్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ పడాల వనిత, ఉపసర్పంచ్ హేమలత, నాయకులు పడాల చంద్రం, గౌస్, సత్యనారాయణ, వెంకటేశం, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

చివరి రోజు 70 మంది హాజరు

భువనగిరి: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఈ నెల 1 నుంచి ప్రాక్టికల్స్ ప్రారంభం కాగా మొదటి దశ పరీక్షలు 5వ తేదీ వరకు కొనసాగాయి. అలాగే రెండో దశ 6 నుంచి 10వ తేదీ వరకు, మూడో దశ 11 నుంచి 15వ తేదీ వరకు జరిగాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల రెండు సెషన్లుగా పరీక్షలు నిర్వహించారు. చివరి రోజు జిల్లా వ్యాప్తంగా రెండు కేంద్రాల్లో మొత్తం 75 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 70 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారని డీఐఈఓ రమణి తెలిపారు.

ప్రజల కష్టాలు తీర్చేలా..

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు యాక్షన్ ప్లాన్ సిద్ధం

- 68 ఆవాసాల్లో నీటి సమస్యను గుర్తించిన యంత్రాంగం
- గోదావరి నీళ్లు తక్కువగా వస్తుండడంతో తక్షణ చర్యలు
- ఎమ్మెల్యే కోటా నిధులతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- అద్దె బోర్ల ద్వారా సరఫరా చేయాలని నిర్ణయం



తుర్కపల్లి పరిధిలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ నీటి సంపు

మండలాల సంఖ్య	ఆవాసాలు
17	769
నల్లా కనెక్షన్లు 1.84 లక్షలు	
స్కీం బోర్లు	నీటి సరఫరా చేస్తున్నవి
1,900	700
ప్రతి మనిషికి రోజుకు అందించాల్సింది 100 లీటర్లు అందుతున్నది 60 లీటర్లు	

సాక్షి, యాదాద్రి: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా యాక్షన్ ప్లాన్ రూపొందించింది. ఇప్పటి వరకు జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలు, 421 గ్రామ పంచాయతీలకు మిషన్ భగీరథతో నీటి సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం గోదావరి జలాలు సరిపోను రానందున స్థానికంగా లభించే బోర్లు, బావుల నీటిని కలిపి సరఫరా చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రభుత్వం ఎమ్మెల్యేలకు కేటాయించిన రూ.10 కోట్లలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.కోటితో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే నీటి ఎద్దడి ఎదురయ్యే గ్రామాలను గుర్తించారు. ఆయా గ్రామాల్లో ఉన్న స్కీం బోర్లను వాడుకోవడం, భూగర్భజలాలు పూర్తిగా అడుగంటుతున్న ప్రాంతాల్లో వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకునే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది.

68 ఆవాసాల్లో నీటి ఎద్దడికి ఆస్కారం..

జిల్లాలోని 68 ఆవాసాల్లో తాగునీటి ఎద్దడి వచ్చే అవకాశం ఉందని గ్రామీణ నీటి సరఫరా అధికారులు గుర్తించారు. ఆత్మకూర్ ఎం, రాజాపేట, బొమ్మల రామారం, తుర్కపల్లి, పోచంపల్లి మండలాల్లోని కొన్ని గ్రామాలు ఉన్నాయి. ఎత్తయిన ప్రాంతాల్లో ఉన్న ఆవాసాలకు ముందుగా తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందని గుర్తించిన అధికారులు ఆయా ప్రాంతాలకు నీటిని సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ చర్యలకు సిద్ధమయ్యారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్ ద్వారా తాగునీరు పూర్తి స్థాయిలో కానందున నీటి ఎద్దడి కన్పించగానే స్టాండ్‌బైగా స్థానిక బోరు నీటిని వాడుకోనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,900 స్కీం బోర్లలో ఇప్పటికే 700 వరకు బోర్లు నీటిని అందిస్తున్నాయి. మరికొన్ని బోర్లు, పైపులైన్ల లీకేజీలను స్థానిక గ్రామ పంచాయతీలోని 15వ ఆర్థిక సంఘం నిధులతో మరమ్మతులు చేసి నీటివృథా అరికట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంకా అవసరం ఉన్నచోట ఎమ్మెల్యేల కోటా నుంచి రూ.కోటి నిధులతో పైప్‌లైన్‌లు వేసి తాగునీరు సరఫరా చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలోని 17 మండలాల్లో గల 769 ఆవాసాల్లో 1,84,339 నల్లాలకు గ్రామీణ నీటి సరఫరా విభాగం నుంచి నీటి సరఫరా జరుగుతోంది. హెచ్‌ఎండబ్ల్యూఎస్ నుంచి ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లోని ఆవాసాలకు 62 మిలియన్ లీటర్స్ పర్ డే (ఎంఎల్‌డీల)కు గాను 32 ఎంఎల్‌డీల నీటి సరఫరా జరుగుతోంది. నల్లగొండ ఉదయ సముద్రం నుంచి మోత్కూరు, అడ్డగూడూరు, రామన్నపేట మండలాలకు 8.9 ఎంఎల్‌డీలకు 8.1 ఎంఎల్‌డీల నీరు మాత్రమే అందుతోంది. అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి చౌటుప్పల్, నారాయణపురం, పోచంపల్లి మండలాలకు 15.5 ఎంఎల్‌డీలకు గాను 14 ఎంఎల్‌డీల కృష్ణాజలాలు సరఫరా చేస్తున్నారు. అయితే హెచ్‌ఎండబ్ల్యూఎస్ నుంచి పూర్తిస్థాయిలో నీటి సరఫరా కాకపోవడంతో వేసవిలో తాగునీటి ఎద్దడికి తలెత్తే అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చూస్తాం

ప్రస్తుత వేసవిలో జిల్లావ్యాప్తంగా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశాం. ప్రధానంగా ఆలేరు, భువనగిరి నియోజక వర్గాలకు గోదావరి నీరు పూర్తిగా రావడం లేదు. మల్లన్నసాగర్ నుంచి వస్తున్న గోదావరి నీరు జిల్లాకు 62 ఎంఎల్‌డీలు రావాల్సి ఉన్నా 34 ఎంఎల్‌డీలు మాత్రమే వస్తున్నాయి. దీంతో స్థానిక బోరు నీటిని కలిపి నల్లాల ద్వారా నీటి సరఫరా చేస్తున్నాం. 15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు, ఎమ్మెల్యేల కోటా నుంచి రూ.కోటి నిధులతో తాగు నీరు సరఫరా చేస్తూ తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటాం.

– వై. కిష్టయ్య, గ్రామీణ నీటి సరఫరా విభాగం జిల్లా అధికారి

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి

- జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు సాయని విజయభారతి

ఆలేరు రూరల్: ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు సాయని విజయభారతి ఆదేశించారు. గురువారం ఆమె ఆలేరులోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాల (రాజాపేట)ను ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని గదులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలతోపాటు పాఠశాల ఆవరణంలోని వెల్‌నెస్ సెంటర్‌లో రిజిస్టర్‌లను తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న వైద్యసేవల వివరాలు, మందులు, మెడికల్ కిట్స్, కిచెన్‌లో వండిన వంటలు, స్నానపు గదులు, టాయిలెట్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా పనిచేస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆమె వెంట ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఇన్‌స్పెక్టర్ అరుణ్ త్యాగి, రెవెన్యూ డివిజన్ అధికారి శేఖర్‌రెడ్డి, డీఈఓ కె.నారాయణ, జిల్లా బీసీ సంక్షేమ అధికారి యాదయ్య, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ వెంకటశ్రీను, మండల అధికారులు ఉన్నారు.



విజయభారతికి మొక్క అందజేసి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

కలెక్టర్ స్వాగతం

భువనగిరి టౌన్: జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు సాయని విజయభారతి గురువారం జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు భువనగిరి కలెక్టరేట్‌లో కలెక్టర్ హనుమంతు కే.జెండగే, డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేష్ చంద్ర పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అంతకుముందు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు భాస్కర్‌రావు, జి.వీరారెడ్డి, ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఇన్‌స్పెక్టర్ అరుణ్ త్యాగి, రెవెన్యూ డివిజనల్ అధికారి శేఖర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి కె.నారాయణరెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూతనివ్వడం హర్షణీయం



దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్, అధికారులు, అలింకో కంపెనీ ప్రతినిధులు

భువనగిరి రూరల్: కేంద్ర ప్రభుత్వ స్కీం ద్వారా దివ్యాంగులకు 603 సహాయ ఉపకరణాలు అందించి చేయూతనివ్వడం హర్షణీయమని జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. జిల్లా మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, అలింకో కంపెనీ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన సామాజిక అధికారిత శిబిరంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోనే దివ్యాంగులు అత్యధికంగా పెన్షన్లు పొందడం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఘనతే అన్నారు. అలింకో ప్రతినిధి సీతూ దూబె మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు సహకరిస్తున్న జిల్లా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, ఇతర ఉపకరణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నరాల నిర్మల వెంకటస్వామి, జెడ్‌టీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, బొమ్మలరామారం ఎంపీపీ సుదీర్‌రెడ్డి, ఐదవ స్థాయి కమిటీ చైర్మన్ తోటకూరి అనురాధ, అలింకో సంస్థ పీఓ రవిశంకర్, దివ్యాంగుల కమిటీ ప్రెసిసెండ్ నర్సింహులు, సభ్యులు సుర్పంగ ప్రకాష్, అశోక్, జిల్లా సంక్షేమ అధికారి, సూపరింటెండెంట్ జి.శశికళ పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి ధర్మభిక్షం

భువనగిరి టౌన్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం.. పేదల ఆశాజ్యోతి అని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. భువనగిరిలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం ధర్మభిక్షం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వస్తువుల అభిలాష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి లక్ష్మయ్య, సీపీఐ భువనగిరి పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, సహాయ కార్యదర్శి చింతల మల్లేశం, సురారం జాని, చొప్పరి సత్తయ్య, చిక్క నర్సయ్య, శాంతమ్మ పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దాతల సహకారం ప్రశంసనీయం

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి, యాదాద్రి: సమాజహిత కార్యక్రమాలకు దాతలు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం కార్యక్రమానికి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరఫున రూ.4 లక్షలు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంపా నాగేందర్ తల్లి సరోజనమ్మ పేరు మీద లక్ష రూపాయలు, ఆత్మకూర్ మండలంలోని సోనాలికా షోరూమ్ వారు 25 వేల రూపాయల చెక్కులను గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సమక్షంలో జిల్లా విద్యాశాఖ అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం పథకానికి ఆర్థిక చేయూతనందించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా దాతలకు ధన్యవాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఇందుకు చొరవ చూపిన అదనపు కలెక్టర్ భాస్కరరావు, డీఈఓ కె.నారాయణరెడ్డిలను అభినందించారు. యాదగిరిగుట్ట, రాజాపేట, వలిగొండ మండలాల్లో దాతల సహకారంతో అల్పాహారం అందిస్తున్నామని, మిగిలిన 14 మండలాలకు ఈరోజు అందించిన ఆర్థిక తోడ్పాటుతో రోజూ పండ్లు, చుడువా, ఉప్మా, ఉడకబెట్టిన గింజలు, బిస్కట్స్ అందించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత చెందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సెక్రటరీ పి.నాగభూషణం మాట్లాడుతూ ఇలాంటి ఉపయోగకరమైన కార్యక్రమాల్లో ముందుంటామన్నారు. అనంతరం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, రైస్ మిల్లర్స్ ప్రతినిధులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



కలెక్టర్ సమక్షంలో డీఈఓకు చెక్కు అందజేస్తున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

నేడు ఇంటర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్

- పరీక్షకు హాజరు కానున్న విద్యార్థులు 6,109 మంది
- జిల్లా వ్యాప్తంగా 69 జూనియర్ కళాశాలలు



విద్యార్థుల ఆంగ్ల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న లెక్చరర్

భువనగిరి: ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచే విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యం పెంచేందుకు ఇంటర్మీడియట్ బోర్డు ఈ విద్యాసంవత్సరంలో మొదటిసారిగా ఇంగ్లిష్ సబ్జెక్టుపై ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు సెకండియర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులతో పాటు ఒకేషనల్ గ్రూపులకు చెందిన విద్యార్థులకు మాత్రం ప్రాక్టికల్స్ పరీక్షలు జరిగేవి. ఇక నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారు. నాలుగు దశల్లో నిర్వహించ తలపెట్టిన ఈ పరీక్షలు ఇప్పటికే మూడు దశల్లో పూర్తికాగా చివరి దశ పరీక్ష శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనుంది. ఇందుకు ఇంటర్మీడియట్ బోర్డు అన్ని ఏర్పాట్లు చేసింది.

నాలుగు దశల్లో పరీక్షలు

ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తప్పకుండా ఇంటర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షకు హాజరు కావాలి. నాలుగు దశల్లో నిర్వహించే ఈ ప్రాక్టికల్‌కు 20 మార్కులు ఉంటాయి. ఇందులో కనీసం 7 మార్కులు వస్తేనే ఇంటర్ ఉత్తీర్ణులైనట్టుగా పరిగణిస్తారు. గైర్హాజరైన విద్యార్థులను ఫెయిల్ అయిన వారిగా పరిగణిస్తారు. ఇక థియరీ పరీక్ష మాత్రం 80 మార్కులకే జరగనుంది. మొదటి దశలో ఏదైనా ఒక అంశంపై ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులు సంభాషించుకునే తీరును అధ్యాపకులు పరీక్షించనున్నారు. రెండో దశలో జస్ట్ ఎ మినిట్ పేరిట ఒక అంశంపై నిమిషం లోపు అనర్గళంగా మాట్లాడాల్సి ఉంటుంది. మూడో దశలో రోల్ ప్లేలో తల్లిదండ్రులు లేదా మరేదైనా అంశంపై విద్యార్థులు బృందంగా చర్చించాలి. నాలుగో దశలో వ్యాసం ఇచ్చి దానికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది.

మొత్తం 6,109 మంది విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా మొత్తం 69 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 11 ప్రభుత్వ, 30 ప్రైవేట్, 10 సాంఘిక సంక్షేమ, 2 మహాత్మా జ్యోతిరావు పూలే, 2 మైనార్టీ, 7 కేజీబీవీలు, 7 మోడల్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి చెందిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు 6,109 మంది ఉన్నారు. వీరిలో ఒకేషనల్ విద్యార్థులు 1,548 మంది ఉన్నారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా..



ఉన్నత ఉద్యోగాల సాధనలో కీలకమైన ఇంగ్లిష్ భాషపై విద్యార్థులు పట్టు సాధించాలని లక్ష్యంగా ఈ ఏడాది నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రవేశపెట్టారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై పరిజ్ఞానాన్ని వెలికితీసేలా పరీక్ష ఉంటుంది. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి. దీనిపై ఇప్పటికే అధ్యాపకులకు అవగాహన కల్పించాం.

– రమణి, డీఐఈఓ, యాదాద్రి భువనగిరి

వాస్తవికత ఎంత!

నకిలీ సర్టిఫికెట్లతో కొందరు కాంట్రాక్ట్ లెక్చరర్లు రెగ్యులరైజ్ అయ్యారని ఆరోపణలు

- నల్లగొండ బాలికల జూనియర్ కళాశాలలో ఓ లెక్చరర్ తొలగింపు
- మరో 11 మందిపై ఏసీబీ డీజీకి ఓయూ స్కాలర్ ఫిర్యాదు
- వీరిలో ఉమ్మడి జిల్లాకు చెందిన వారు ఎనిమిది మంది



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసే కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్ విషయంలో సర్టిఫికెట్ల జెన్యూనిటీ(వాస్తవికత)పై లొల్లి రాజుకుంది. 20 ఏళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న లెక్చరర్లను వారి అర్హతను బట్టి గతేడాది మే నెలలో రెగ్యులరైజేషన్ చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే అందులో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అనుమతి లేని వాటి నుంచి తెచ్చుకున్న సర్టిఫికెట్ల ఆధారంగా కొంతమందిని రెగ్యులరైజ్ చేసినట్లు ఉస్మానియా యూనివర్సిటీకి స్కాలర్ శంకర్ ఏసీబీ డైరెక్టర్ జనరల్‌కు బుధవారం రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అందులో 11 మంది కాంట్రాక్టు లెక్చరర్ల పేర్లను పొందుపరిచారు. వీరితో పాటు చాలా మంది చెల్లని సర్టిఫికెట్లను పెట్టారని, ఈ వ్యవహారంలో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.. ఆ 11 మందిలో 8 మంది ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన వారే ఉండడం గమనార్హం. ఈ వ్యవహారంలో ఇంటర్ విద్యాశాఖ ఆర్జేడీ, కొంతమంది ప్రిన్సిపాళ్లు అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే చెల్లని సర్టిఫికెట్ల వ్యవహారంలో ఇప్పటికే నల్లగొండలో ఒక లెక్చరర్‌ను సర్వీసు నుంచి అధికారులు తొలగించారు.

ఉమ్మడి జిల్లాలో కాంట్రాక్టు లెక్చరర్లు ఇలా..

జిల్లా	కాలేజీలు	లెక్చరర్లు	రెగ్యులరైజ్డ్	రెగ్యులరైజ్ కావాల్సినవారు
నల్లగొండ	12	143	108	35
సూర్యాపేట	7	78	64	14
యాదాద్రి	11	111	85	26
మొత్తం	30	332	257	75

332 మంది కాంట్రాక్టు లెక్చరర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 30 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. వాటి పరిధిలో 332 మంది కాంట్రాక్టు లెక్చరర్లు 20 ఏళ్లుగా పని చేస్తున్నారు. 2014కు ముందు కేసీఆర్ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారు. అనుకున్న విధంగానే అధికారంలోకి రావడంతో రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ విషయమై కోర్టులో కొందరు కేసులు వేయడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. దీంతో అప్పటి సీఎం కేసీఆర్ ప్రభుత్వ లెక్చరర్లతో సమానంగా వారికి వేతనాలు పెంచారు. ఆ తరువాత కోర్టు కేసు తొలగిపోవడంతో 2023లో రెగ్యులరైజేషన్‌కు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకు పీజీతో పాటు ఇతర అర్హతలను నిర్ణయించింది. ఆ నిబంధనల ప్రకారం ఉన్న వారిని రెగ్యులరైజ్ చేస్తామని ప్రకటించింది. వీరిలో చాలా మంది గుర్తింపు లేని యూనివర్సిటీల నుంచి పీజీ సర్టిఫికెట్లు తెచ్చి విద్యాశాఖకు సమర్పించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో విద్యాశాఖ అధికారులు ఫిర్యాదు వచ్చిన వారిపై జెన్యూనిటీ సర్టిఫికెట్ కోసం ఆయా యూనివర్సిటీలకు లేఖలు రాశారు. యూనివర్సిటీల నుంచి ఆ సర్టిఫికెట్లు జెన్యూనిటీ అని సమాధానం రావడంతో వారిని రెగ్యులరైజ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 257 మందిని రెగ్యులరైజ్ చేశారు. వీరిలో కొంత మందివి చెల్లని సర్టిఫికెట్లు అన్న ఆరోపణలు ఉన్నాయి.

సర్వీస్ నుంచి లెక్చరర్ తొలగింపు

నల్లగొండ జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కాలేజీలో పనిచేసే కాంట్రాక్టు లెక్చరర్ ఆయేషా పర్వీనా చెల్లని సర్టిఫికెట్‌తో రెగ్యులరైజ్ అయ్యారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఫిర్యాదులు వెళ్లడంతో ఉన్నత స్థాయిలో విచారణకు ఆదేశించారు. దీంతో ఆమె చెల్లని సర్టిఫికెట్ పెట్టినట్లు తేలడంతో సర్వీసు నుంచి తొలగించినట్లు నల్లగొండ డీఐఈఓ దస్రూనాయక్ తెలిపారు.

జెన్యూనిటీ కూడా తప్పే అంటూ ఆరోపణలు

యూజీసీ నుంచి ఎలాంటి గుర్తింపు లేని యూనివర్సిటీల్లో చదివిన డిగ్రీలు చెల్లుబాటు కావు. అలాంటప్పుడు ఆ సర్టిఫికెట్లను పెట్టి ఎలా రెగ్యులరైజ్ చేస్తారంటూ ఆరోపణలు వచ్చాయి. జెన్యూనిటీ అనేది ఆ యూనివర్సిటీలు ఇస్తే జెన్యూన్ ఎలా అవుతుందన్న ప్రశ్నలు వస్తున్నాయి. వాస్తవంగా దేశ్యాప్తంగా.. రాష్ట్రాల్లో ఏయే యూనివర్సిటీలకు తమ గుర్తింపు ఉందనేది యూజీసీ ఏటా ప్రకటిస్తుంది. అయితే యూజీసీ గుర్తింపు లేని యూనివర్సిటీల నుంచి తెచ్చిన సర్టిఫికెట్లు ఎలా జన్యూన్ అవుతాయని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. వాటి ఆధారంగా ఎలా రెగ్యులరైజ్ చేస్తారంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ



కావేరిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ధనవిజయలక్ష్మి

నడిగూడెం: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎం. కావేరి ఈ నెల 14న రాజస్థాన్ రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరఫున పాల్గొని తృతీయ బహుమతి సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్. ధనవిజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కావేరిని పాఠశాలలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం. వసంత, ఉపాధ్యాయులు రేణుక, ఏ. వెంకటేశ్వర్లు, రవికృష్ణ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

రాజాపేట: తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు జారడంతో కిందపడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన రాజాపేట మండలంలోని బేగంపేట గ్రామంలో గురువారం సాయంత్రం జరిగింది. బేగంపేట గ్రామానికి చెందిన గీత కార్మికుడు జామచెట్టు భాస్కర్ కల్లు గీసేందుకు గ్రామ శివారులో తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు జారడంతో కిందపడిపోయాడు. దీంతో భాస్కర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పక్కనే ఉన్న రైతులు గమనించి చికిత్స నిమిత్తం అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు అతడిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

శాలిగౌరారం: శాలిగౌరారం గ్రామ పంచాయతీ పరిధిలోని పావురాలగూడెంలో గల ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. గురువారం దేవాలయాన్ని శుభ్రం చేసేందుకు వెళ్లిన వ్యక్తి ఆలయ ప్రాంగణంలోని బీరువా, హుండీ ధ్వంసమై ఉండటాన్ని గమనించి స్థానికులకు సమాచారం అందించారు. దీంతో గ్రామస్తులు వెంటనే దేవాలయం వద్దకు చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. హెడ్‌కానిస్టేబుల్ నజీరుద్దీన్ దేవాలయానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. దొంగలు హుండీ తాళాన్ని పగులగొట్టి అందులో ఉన్న సుమారు రూ.15 వేలతో పాటు పక్కనే బీరువాలో ఉన్న రూ.10 వేల నగదు, మైక్‌సెట్ యాంప్లిఫయర్, ఇతర సామగ్రి, రెండు పెద్ద కంచు గంటలను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. చోరీకి గురైన సొత్తు విలువ సుమారు రూ.50 వేలకు పైగా ఉంటుందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు గోదల వెంకట్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- చెర్వుగట్టుపై గర్భగుడిలో ప్రత్యేక పూజలు
- పాల్గొననున్న మంత్రి కోమటిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వీరేశం
- శనివారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణోత్సవం



చెర్వుగట్టు పైకి వెళ్లే మెట్ల మార్గం



గర్భగుడిలో కొలువైన రామలింగేశ్వరుడు

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో వెలిసిన శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయ గర్భగుడిలో శుక్రవారం రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి బ్రహ్మోత్సవాలను అంకురార్పణ చేయనున్నారు. ఈ ప్రత్యేక పూజల్లో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, నల్లగొండ జిల్లా కలెక్టర్ హరిచందన పాల్గొననున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

రేపు కల్యాణోత్సవం..

శనివారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణం, ఆదివారం తెల్లవారుజామున అగ్నిగుండాలు, సోమవారం తెల్లవారుజామున దోపోత్సవం, సాయంత్రం ఏకాంతసేవ, మంగళవారం ఉదయం రుద్రాభిషేకం, ఏకాంతసేవ, బుధవారం సాయంత్రం గజవాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు..

స్వామి వారి కల్యాణ్యాన్ని భక్తులు తిలకించేందుకు కొండ పైన, కింద 6 ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు ఏర్పాటు చేస్తున్నారు. కొండ పైకి వెళ్లే ఘాట్ రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లతో పాటు ఘాట్ రోడ్డు వెంట పలు చోట్ల మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ప్రతిరోజు రాత్రి కొండ పైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కొండ పైన, కింద ఏర్పాటు చేయనున్న ప్రత్యేక ఆరోగ్య కేంద్రాల లో 24 గంటలు పాటు 40 మంది వైద్య సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. అంతేకాకుండా 2 అంబులెన్స్‌లను ఏర్పా టు చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ పర్యవేక్షణ, నీటి సమస్య పరిష్కరించేందుకు గాను చెర్వుగట్టు పరిసరాలను 8 జోన్‌లు ఏర్పాటు చేసి, 9మంది ఎంపీఓలు, 84 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులు, 310 మంది సిబ్బందిని కేటాయించారు. కొండ పైన, కింద విచారణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భక్తులు తమ వస్తువులను వారే భద్రపర్చుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వారిపై చర్యలు తీసుకుంటామని నార్కట్‌పల్లి ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

భక్తుల కోసం ప్రత్యేక బస్సులు..

బ్రహ్మోత్సవాలకు విచ్చేయుచున్న భక్తుల కోసం నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ డిపోల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు నార్కట్‌పల్లి డిపో మేనేజర్ వెంకటమ్మ తెలిపారు. ప్రతి 5 నిమిషాలకు ఒక బస్సును నడుపుతున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్, భువనగిరి నుంచి నల్లగొండకు వచ్చే ప్రతి ఆర్డినరీ బస్సు చెర్వుగట్టు గ్రామం మీదుగా వెళ్తుందని తెలిపారు. జిల్లా పరిధిలోని వివిధ డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులు కూడా ఎల్లారెడ్డిగూడెంలో ఆగేలా చర్యలు తీసుకున్నామన్నారు. వాహనాలకు కొండ కిందనే వివిధ ప్రాంతాల్లో పార్కింగ్ సౌకర్యం కల్పించారు.

భారీ బందోబస్తు ఏర్పాటు



చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల నిర్వహణకు 3 డీఎస్పీలు, 6గురు సీఐలు, 29 మంది ఎస్ఐ, ఏఎస్ఐలు, 78 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 250 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశాం.

– అంతిరెడ్డి, ఎస్ఐ, నార్కట్‌పల్లి

విద్యుదాఘాతంతో రైతు మృతి

మిర్యాలగూడ టౌన్: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ ఘటన మిర్యాలగూడ మండలంలోని జాలుబావితండాలో గురువారం జరిగింది. గ్రామస్తులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జాలుబావి తండాకు చెందిన జర్పుల లింగునాయక్(32) తన కున్న ఎకరన్నర పొలంతో పాటు మరికొంత పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటున్నాడు. తాను సాగుచేస్తున్న పొలం వద్ద బోరు మోటారు పనిచేయకపోవడంతో గురువారం సాయంత్రం ఓ మెకానిక్‌ను తీసుకొచ్చాడు. ఆ మెకానిక్ మోటారు బాగానే ఉందని చెప్పి వెళ్లిపోయాడు. దీంతో లింగునాయక్, అతడి భార్య మంగ ఇరువురు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్తుతుండగా ఎర్త్ వైరు తగలడంతో విద్యుదాఘాతానికి గురై లింగునాయక్ శరీరం కొంత మేర కాలిపోయింది. దీంతో వెనుక నుంచి వస్తున్న భార్య మంగను దగ్గరికి రావద్దంటూ గట్టిగా అరువగా పక్కనే ఉన్న రైతులు కూడా అక్కడికి వచ్చారు. లింగునాయక్‌ను వెంటనే మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడికి ఇద్దరు కవల పిల్లలు సంతానం. మృతుడి తండ్రి బాషాసింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లింగునాయక్ (ఫైల్)

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో 2 నెలల కాలపరిమితి కల్గిన బ్యూటీషియన్ కోర్సులో నిరుద్యోగ యువతులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు పదో తరగతి పాసై ఉండి, 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కల్గి ఉండాలన్నారు. ఆసక్తి కల్గిన వారు తమ విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈ నెల 21న సంస్థలో నేరుగా హాజరు కావాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి నెలకు రూ.3వేల ఫీజుతో హాస్టల్ వసతి కూడా కల్పించబడుతుందని అన్నారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

- వారి నుంచి చోరీ చేసిన వస్తువులు కొనుగోలు చేసిన స్క్రాప్ దుకాణం యాజమాని కూడా పోలీసుల అదుపులో..

భువనగిరి క్రైం: దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులతో పాటు వారి నుంచి చోరీ చేసిన వస్తువులను కొనుగోలు చేసి స్క్రాప్ దుకాణం యాజమానిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వివరాలు.. భువనగిరి పట్టణంలోని హౌసింగ్ బోర్డుకు చెందిన ఊదరి గౌతంయాదవ్ పక్కనే కొత్తగా ఇల్లు కట్టుకుంటున్నాడు. కొత్తగా నిర్మిస్తున్న ఇంట్లో ఈ నెల 12వ తేదీన కరెంట్ వైరింగ్ చేయించగా.. మరుసటి రోజు ఉదయం వచ్చి చూడగా కరెంట్ వైరు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కాగా భువనగిరి పట్టణంలోని జగదేవ్‌పూర్ చౌరస్తా వద్ద గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లికి చెందిన ధనావత్ తిరుపతి, ఆర్వా శ్రీను బైక్‌పై వెళ్తూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని ఎస్ఐ వీరస్వామి అదుపులోకి తీసుకొని విచారించగా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని బోయిన్‌పల్లి, నారపల్లి నందు రెండు బైక్‌లను, భువనగిరి పట్టణంలోని ఓ పార్కులో జిమ్ వస్తువులను, హౌసింగ్ బోర్డులోని గౌతంయాదవ్ ఇంట్లో కరెంట్ వైరును చోరీ చేసినట్లు నిజం ఒప్పుకున్నారు. జిమ్ వస్తువులు, కరెంట్ వైరు నుంచి తీసిన కాపర్ వైరును భువనగిరి పట్టణంలోని స్క్రాప్ దుకాణంలో అమ్మినట్లు నిందితులు తెలిపారు. నిందితులతో పాటు స్క్రాప్ దుకాణం యజమాని గులాం ముజీబ్‌ని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వీరస్వామి తెలిపారు. నిందితుల నుంచి 14 కిలోల కాపర్ వైరు, హోండా యాక్టివా, డియో మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు

హుజూర్‌నగర్: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం కీతవారిగూడేనికి చెందిన కొత్త వెంకటేశ్వర్లు, యల్లావుల సాయి సూర్యాపేట మండలం దాసరంలో ఇసుకను తక్కువ ధరకు కొనుగోలు చేసి హుజూర్‌నగర్‌లో అధిక ధరకు అమ్మేందుకు రెండు ట్రాక్టర్లలో తీసుకొస్తున్నారు. రెండు ట్రాక్టర్లను హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్‌లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపుతప్పి కారు బోల్తా.. యువకుడు మృతి

- మరో నలుగురికి గాయాలు

యాదగిరిగుట్ట రూరల్: అదుపుతప్పి కారు బోల్తా పడడంతో ఓ యువకుడు మృతిచెందాడు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామ సమీపంలో మోటకొండూర్ మండలం వెళ్లే జంక్షన్ వద్ద హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని దమ్మాయిగూడకు చెందిన రాహుల్ (25)తో పాటు కంసాని మనోజ్‌రెడ్డి, దాసరి సాయి చరణ్‌రెడ్డి, రాచపాట కార్తీక్, గంప రాజు కలిసి బుధవారం ఉదయం స్విఫ్ట్ కారులో జనగామ జిల్లాలో తమ స్నేహితుడి పెళ్లికి వెళ్లారు. పెళ్లి అనంతరం గురువారం తెల్లవారుజామున జనగామ నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామ సమీపంలోకి రాగానే అతివేగంతో ఉన్న కారు మోటకొండూర్ జంక్షన్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న రాహుల్ అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను కూడా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

హోటల్ నిర్వాహకుడిపై యువకుల దాడి

మిర్యాలగూడ అర్బన్: న్యూడిల్స్ తిని డబ్బులు ఇవ్వకుండా వెళ్తున్న యువకులను డబ్బులు అడిగిన హోటల్ నిర్వాహకుడిపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి మిర్యాలగూడ పట్టణంలోని నార్కట్‌పల్లి-అద్దంకి బైపాస్‌లో ఏడుకోట్లతండా వద్ద జరిగింది. మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏడుకోట్లతండా వద్ద రోడ్డు వెంట ఉన్న హోటల్‌లోకి బుధవారం అర్ధరాత్రి ఐదుగురు యువకులు వెళ్లి న్యూడిల్స్ తిన్నారు. తిన్న తర్వాత వారు బిల్లు ఇవ్వకుండా వెళ్లిపోతుండగా.. హోటల్ నిర్వాహకుడు బొమ్మగాని సురేష్ డబ్బులు అడిగాడు. మత్తులో ఉన్న ఆ ఐదుగురు యువకులు 'మమ్ములనే డబ్బులు అడుగుతావా..' అంటూ సురేష్‌ను విచక్షణారహితంగా కొట్టారు. దీంతో సురేష్ ముక్కుకు తీవ్రగాయం అయ్యింది. గాయపడిన సురేష్‌ను హోటల్ పనిచేసే వ్యక్తులు మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదుగురు యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



గాయపడిన సురేష్

తాళం వేసిన ఇంట్లో చోరీ

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం అవంతిపురంలో గురువారం తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ సతీష్‌వర్మ తెలిపిన వివరాల ప్రకారం.. అవంతీపురం గ్రామంలోని కోదాడ-జడ్చర్ల ప్రధాన రహదారి వెంట నివాసముంటున్న శివనేని లక్ష్మి, వెంకటేశ్వర్లు దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. రోజు మాదిరిగానే లక్ష్మి, వెంకటేశ్వర్లు దంపతులు గురువారం మిర్యాలగూడకు కూలీ పనులకు వెళ్లగా చిన్న కుమార్తె స్కూల్‌కు వెళ్లింది. పెద్ద కుమార్తె మిర్యాలగూడలో కాలేజీకి వెళ్లింది. మధ్యాహ్నం పెద్ద కుమార్తె కాలేజీ నుంచి ఇంటికి వచ్చేసరికి ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. అంతేకాకుండా బీరువాలోని రూ.48వేలు చోరీకి గుర్తించి విషయం తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో లక్ష్మి, వెంకటేశ్వర్లు దంపతులు మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సతీష్‌వర్మ తన సిబ్బందితో పాటు నల్లగొండ నుంచి క్లూస్ టీంను పిలిపించి సంఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

- భర్తకు గాయాలు
- బైక్‌పై వెళ్తుండగా ఢీకొట్టిన బస్సు

భువనగిరి క్రైం: బైక్ వెళ్తున్న దంపతులను బస్సు ఢీకొట్టడంతో భార్య మృతిచెందింది. భర్తకు గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరి మండలంలోని రాయగిరి బైపాస్ వద్ద గురువారం సాయంత్రం జరిగింది. వివరాలు.. జనగామ జిల్లా వెల్దండకు చెందిన మల్లం సంపత్, అతడి భార్య నవ్యశ్రీ(24)లు హైదరాబాద్‌లోని రాంనగర్‌లో నివాసం ఉంటున్నారు. సంపత్ అక్కడే కోకాకోలా కంపెనీలో పనిచేస్తున్నాడు. కాగా సమ్మక్క-సారక్క జాతరకు వెళ్లేందుకు గాను గురువారం సంపత్, నవ్యశ్రీ బైక్‌పై సొంతూరు వెల్దండకు వెళ్తుండగా.. భువనగిరి మండలంలోని రాయగిరి బైపాస్ సమీపంలో గుర్తుతెలియని బస్సు వారి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నవ్యశ్రీకి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. సంపత్‌కు గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు నవ్యశ్రీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.



నవ్యశ్రీ (ఫైల్)

విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి 'ఎడ్యునెట్' కృషి

నల్లగొండ రూరల్: విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఎడ్యునెట్ ఫౌండేషన్ కృషి చేస్తుందని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం యూనివర్సిటీలో ఎడ్యునెట్ ఫౌండేషన్ సహకారంతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు ఎంఓయూ చేసుకున్నారు. వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ.. సాంకేతిక, కంప్యూటర్ రంగాల్లో విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి ఎడ్యునెట్ ఫౌండేషన్ మరింత సహకారం అందిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయబోయే 16 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లలో ఎంజీయూ ఒకటిగా నిలువనుందన్నారు. ఈ సంస్థ ద్వారా అధునాతన సౌకర్యాలతో కూడిన కంప్యూటర్ ల్యాబ్ ద్వారా ఎంసీఏ, ఇంజినీరింగ్ విద్యార్థులకు సాప్, మిషన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ప్రశాంతి, మిర్యాల రమేష్, రేఖ, జయంతి, సుధ సంధ్య, మానస, దుర్గాప్రసాద్, ఎడ్యునెట్ ఫౌండేషన్ ప్రతినిధులు రవీందర్‌సింగ్, వాహెద్ షేక్, ప్రదీప్‌రెడ్డి, సుధీర్ పాల్గొన్నారు.



ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న వైస్‌చాన్స్‌లర్, ఎడ్యునెట్ సభ్యులు

రూ.12లక్షల విలువైన రేషన్ బియ్యం పట్టివేత

- నలుగురు నిందితుల అరెస్ట్
- పరారీలో మరొకరు
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే



సూర్యాపేట క్రైం: వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం: రూ.12లక్షలు విలువైన 30 టన్నుల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే వెల్లడించారు. గురువారం సూర్యాపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణ పోలీస్ సిబ్బంది గురువారం స్థానిక జనగామ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఏపీ 16 టీవై 6316 నంబర్ గల లారీ బియ్యం లోడుతో వెళ్తోంది. దానిని పరిశీలించగా అందులో సుమారు 20టన్నుల రేషన్ బియ్యం ఉంది. డ్రైవర్, క్లీనర్‌ను విచారించారు. కోదాడ పట్టణానికి చెందిన షేక్ మీరాఅలీ చుట్టుపక్కల గ్రామాల్లో తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నాడని డ్రైవర్, క్లీనర్ తెలిపారు. షేక్ మీరాఅలీ చెప్పినట్లు లారీలో 20టన్నుల రేషన్ బియ్యాన్ని ఖమ్మం జిల్లా కూసుమంచి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నామని వారు చెప్పారు. దీంతో పట్టణ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పోలీసు సిబ్బందితో కలిసి కూసుమంచికి వెళ్లి తనిఖీ చేయగా షేక్ మీరాఅలీకి చెందిన 3 అశోక్ లేలాండ్ వాహనాల్లో మరో 10టన్నుల రేషన్ బియ్యం ఉండగా పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిత్యావసరాల వస్తువుల దుర్వినియోగ చట్టం, చీటింగ్ చట్టం కింద కేసు నమోదు చేసి బత్తుల గురువయ్య, గద్దల వెంకటేశ్వర్లు, వద్య మంగులాల్, పెనిగుంట నరేష్‌ను అరెస్టు చేసినట్లు ఎస్పీ వివరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని మరో నిందితుడు షేక్ మీరాఅలీ పరారీలో ఉన్నాడని త్వరలోనే పట్టుకుంటామన్నారు. ప్రభుత్వ బియ్యం పక్కదారి పట్టించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి వారు ఉన్నా చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ఇలాంటి నేరాలు అలవాటుగా చేసే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది కరుణాకర్, కృష్ణ సైదులు మధు పాల్గొన్నారు.

చిలుకూరులో 95 క్వింటాళ్లు..

చిలుకూరు: మండలంలోని బేతవోలు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గురువారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు బేతవోలు గ్రామ శివారులో డబుల్ బెడ్‌రూం ఇళ్ల దగ్గర 122 బస్తాల్లో నిల్వ చేసిన సుమారు 55 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంతో పాటు, అదే గ్రామంలో మరో చోట నిల్వ చేసిన 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసిన బెజవాడ లక్ష్మీనారాయణ, బెజవాడ సైదులుపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సీజ్ చేసిన బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు అప్పగించనట్లు ఎస్ఐ తెలిపారు.

దామరచర్ల శివారులో 20 క్వింటాళ్లు..

మిర్యాలగూడ: వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని దామరచర్ల మండల కేంద్రం శివారులో గురువారం పట్టుకున్నట్లు వాడపల్లి ఎస్ఐ రవి తెలిపారు. దామరచర్ల మండల కేంద్రం శివారులోని అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై మిర్యాలగూడ వైపు నుంచి నంబర్ ప్లేట్ లేని వాహనం అనుమానస్పదంగా వెళ్తుండడంతో వెంబడించగా డ్రైవర్ వాహనాన్ని వదిలి పారిపోయినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. వాహనాన్ని పరిశీలించగా అందులో 40 బస్తాల(సుమారు 20క్వింటాళ్ల) పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యాదాద్రిలో నేడు రథ సప్తమి వేడుకలు



ఉదయం సేవకు సిద్ధమైన సూర్యప్రభ వాహనం



రాత్రి ఊరేగించేందుకు సిద్ధం చేసిన స్వర్ణ రథం

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రథ సప్తమి వేడుకలు నిర్వహించేందుకు ఆలయ ఆచార్యులు, అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వేకువజామునే ఆలయాన్ని తెరచిన తర్వాత పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం స్వామి వారిని సూర్యప్రభ వాహనంపై ప్రత్యేకంగా అలంకరించి, ఉదయం 6.40గంటలకు ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగిస్తారు. అనంతరం తూర్పు రాజగోపురం ముందు గల మాడవీధిలో శ్రీస్వామి వారి సూర్యప్రభ సేవను అధిష్ఠించి, ఆచార్యులు చతుర్వేద పారాయణం జరిపిస్తారు. వెంటనే రథ సప్తమి విశిష్టతను భక్తులకు ఆచార్యులు వివరిస్తారు. ఇక రాత్రి 7గంటలకు శ్రీస్వామి వారిని స్వర్ణ రథంపై ఆలయ తిరు, మాడ వీధిలో ఊరేగించనున్నారు. ఇందుకు సంబంధించి సూర్యప్రభ వాహనాన్ని, స్వర్ణ రథాన్ని ఆలయ సిబ్బందిచే శుభ్రం చేసి సిద్ధం చేశారు.

మంచు తెర చాటున..

చౌటుప్పల్ పట్టణ కేంద్రాన్ని గురువారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఉదయం 9గంటల వరకు మంచు ఉండడంతో విజయవాడ-హైదరాబాద్ హైవేపై వాహనదారులు లైట్లు వేసుకొని రాకపోకలు సాగించారు. మరికొందరు ముందు జాగ్రత్తగా వాహనాలను రోడ్డు పక్కన సురక్షితంగా నిలుపుకున్నారు.

– చౌటుప్పల్



